సాక్షి
ప్రకాశం

మంగళవారం । 24 । జూన్ । 2025



తొలిరోజే తుస్సు

మహిళా సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు తొలిరోజే తుస్సుమన్నాయి. కొద్ది నెలల్లో పదవీ కాలం ముగుస్తుండగా ఇప్పడు మూడు రోజుల శిక్షణపై వారు ఆసక్తి చూపడం లేదు.

- 8లో..

జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించాలి



సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలను జాప్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
33 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

రేపు టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సమావేశం

ఒంగోలు సబర్బన్: జిల్లా టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సమావేశం ఈ నెల 25న ఒంగోలు నగరంలోని బీఎస్ఎన్ఎల్ కాన్ఫరెన్స్‌లో హాలులో నిర్వహిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ ఒంగోలు ఎస్‌డీఈ సీఏఓఫ్ డి.రాంబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన టెలిఫోన్ అడ్వజయిజరీ కమిటీ సమావేశం సాయంత్రం 4 గంటలకు నిర్వహస్తున్నట్లు తెలిపారు.

సీపీఐ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

దర్శి(కురిచేడు): సీపీఐ జిల్లా మహాసభల ముగింపు సందర్భంగా సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా ఎంఎల్.నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శిగా ఆర్.వెంకట్రావ్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కే వీరారెడ్డి, ఎస్‌డీ యాసిన్, కేవీ కృష్ణ గౌడ్, యం.విజయ, వై.రవీంద్రబాబు, యం రమేష్‌బాబు, ఎస్‌డీ మౌలాలి, ఆర్ రామకృష్ణ, పీ ప్రభాకర్, ఎన్.మురళి, కే వెంకటేశ్వర్లు, డీ శ్రీనివాస్, ఎస్‌కే ఖాశీం, శ్రీరామ్ శ్రీనివాస్, ఆర్ లక్ష్మి, బీ రామయ్య, ఎస్ రావమ్మ, అందె నాసరయ్య, వీ హనుమారెడ్డి, కేవీ రమణ, ఆర్ కరుణానిధి, మరో 71 మందితో నూతన సమితిని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ నాయకులు తెలిపారు.

మహాసభల తీర్మానాలివీ..

సీపీఐ జిల్లా 17వ మహాసభల సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించింది. పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు కేటాయించి సత్వరం పూర్తిచేయాలని, నికర జలాలు కేటాయించి నిర్వాసితులకు భూసేకరణచట్టం ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇవ్వాలని, ప్రకాశం జిల్లా సమగ్ర అభివృద్ధి కి రూ.10 వేల కోట్లు కేటాయించి అభివృద్ధి చేయాలని, దొనకొండ పారిశ్రామిక కారిడార్‌కు అవసరమైన నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయాలని, కనిగిరి నియోజకవర్గంలో జాతీయ పెట్టుబడులు, ఉత్పత్తుల జోన్ లో పరిశ్రమలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, సాగర్ కుడికాలువ రెండవ దశ పేరుతో కురిచేడు వద్ద ఆగిపోయిన పనులు ప్రారంభించి నెల్లూరు జిల్లా చివరి వరకు పొడిగించాలని, ప్రకాశం జిల్లాను కేంద్ర ప్రభుత్వం కరువు జిల్లాల జాబితాలో చేర్చాలని తదితర తీర్మానాలు చేశారు.

వీరయ్య చౌదరి హత్య కేసులో నలుగురి కస్టడి

ఒంగోలు టౌన్: తెలుగుదేశం పార్టీ నాయకుడు, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో నలుగురిని పోలీసు కస్టడీకి తీసుకోనున్నారు. హత్యలో ప్రధాన పాత్ర పోషించిన బొర్లగుంట వినోద్ కుమార్, ఆళ్ల సాంబశివరావు అలియాస్ సిద్ధాంతి, గోళ్ల రుత్యేంద్ర బాబు, ఓబిలి నాగరాజులను పోలీసు కస్టడీకి తీసుకుంటున్నారు. ఈ నలుగురు హత్యలో నేరుగా పాల్గొన్నట్లు పోలీసులు చెబుతున్నారు. వీరి నుంచి సూత్రధారుల గురించి సమగ్ర వివరాలు సేకరించనున్నట్లు సమాచారం. తాలూకా పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మొత్తం మూడు రోజుల పాటు పోలీసులు విచారించనున్నారు. వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ముప్ప సురేష్ ఇప్పటి వరకు పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. అతడు పోలీసులకు లొంగిపోనున్నాడని, ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నాడని ప్రచారం జరుగుతోంది. రాజకీయంగా ముప్పకు బాగా పలుకుబడి ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. ముప్ప దొరికితేనే తప్ప ఈ హత్య కేసులో చిక్కుముడులు వీడవని పోలీసు అధికారులు చెబుతున్నారు.



శాంతియుత ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి



ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు, విద్యార్థులు



పోలీసుల ఆంక్షలతో కర్ఫ్యూను తలపిస్తున్న కలెక్టరేట్ పరిసరాలు

ఆంక్షలు చెరిపేసి.. పిడికిళ్లు ఎగసి!

- కలెక్టరేట్ చుట్టూ మోహరించిన పోలీసు బలగాలు
- బారికేడ్లు ఏర్పాటు చేసి యువతను నిలువరించిన పోలీసులు
- ప్రభుత్వ వైఫల్యంపై నినదించిన యువత
- జిల్లా నలుమూల నుంచి భారీగా తరలి వచ్చిన నిరుద్యోగులు, విద్యార్థులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు
- వినతి పత్రానికి 50 మందికే అనుమతి..
- నిరుద్యోగులను నిట్టనిలువునా మోసం చేసిన చంద్రబాబు
- హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం
- యువతపోరు ర్యాలీలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

సాక్షిప్రతినిధి, ఒంగోలు:

లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తాం.. అంత వరకూ నిరుద్యోగ భృతి ఇస్తామంటూ అన్ని రకాలుగా ప్రభుత్వం మోసం చేసిందంటూ యువత ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు నగరంలో నిర్వహించిన 'యువత పోరు'కు అడుగడుగునా పోలీసులు ఆంక్షలు విధించారు. ఉదయం నుంచే కలెక్టరేట్ చుట్టుపక్కల భారీగా పోలీసు బలగాలను దించారు. అంబేడ్కర్ భవనానికి వెళ్లే దారిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటుగా సామాన్య జనాన్ని కూడా రాకపోకలు సాగించకుండా కట్టడి చేశారు. చివరికి అంబేడ్కర్ భవనం సమీపంలో పాత రిమ్స్ లోపల నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే కాలిబాట వద్దకు కూడా పోలీసులను కాపలా పెట్టారు. ఎటుచూసినా పోలీసు బలగాలే. కలెక్టరేట్ పరిసరాల్లో కర్ఫ్యూ వాతావరణాన్ని సృష్టించారు. ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, పలువురు ఎస్సైలు, సీఆర్‌పీఎఫ్ బలగాలు, స్పెషల్ బ్రాంచి, ఇంటలిజెన్స్ పోలీసు విభాగాలను రంగంలోకి దించి హడావుడి సృష్టించారు. డ్రోన్ కెమెరాలతో యువత పోరుకు హాజరైన వారిని చిత్రీకరించారు. ఏదో జరిగిపోతుందోన్న భయానక వాతావరణాన్ని కల్పించారు. అంబేడ్కర్ భవనం నుంచి కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామని చెప్పినా పోలీసు అధికారులు ససేమిరా అన్నారు. అక్కడ నుంచి కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వెళ్లడానికి పోలీసులు కేవలం 50 మంది మాత్రమే అనుమతించారు. వినతిపత్రం అందించడానికి కేవలం ఐదుగురిని మాత్రమే అనుమతి ఇచ్చారు. స్పందన కార్యక్రమంలో ఉన్న కలెక్టర్ వెళ్లిపోవడంతో డీఆర్వో ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆంక్షలు తమను నిలువరించలేవంటూ జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, యువజనులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంబేడ్కర్ భవన్ నుంచి ప్రధాన రహదారి పైన ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా తరలివచ్చారు. తమ నిరసనను తెలియజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, మాజీ ఎమ్మెల్యే రాంబాబు, చుండూరి రవిబాబు, దద్దాల నారాయణ, పల్నాటి రవీంద్రారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

నియంతృత్వ పాలన తగదు : అన్నా

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందని మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు విమర్శించారు. ప్రజలకు అండగా పోరాటాలు చేస్తోన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల మీద తప్పుడు కేసులు బనాయించేందుకు ప్రభుత్వం వెనకాడటం లేదని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేశారని, హామీల అమలు కోసం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ వెనకడుగు వేయలేదని చెప్పారు. హామీల అమలు కోసం ప్రజలు రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సి వస్తోందని, అయినా దున్నపోతు మీద వర్షం కురిసినట్లు కూటమి పాలకులు మొండిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

జైల్ భరోకు కూడా సిద్ధమే : చుండూరి

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, యువకులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరుతూ శాంతియుతంగా ర్యాలీ చేయడానికి వస్తే సవాలక్ష ఆంక్షలతో పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు విమర్శించారు. యువత పోరుకు జిల్లా వ్యాప్తంగా తరలివస్తున్న విద్యార్థి యువజన నాయకులను ఎక్కడికక్కడ నిలిపేసి ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తామని చెబితే కేవలం 50 మందికి మాత్రమే అనుమతి ఉందని అంటున్నారనీ ఇది ఎంత మాత్రం మంచి పద్ధతి కాదని చెప్పారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజా సమస్యలను మరుగు పరిచేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. పొదిలిలో పొగాకు రైతులకు మద్దతు తెలపడానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తే మహిళలను అడ్డుపెట్టుకొని గొడవలు సృష్టించారని ఆరోపించారు. గొడవలు సృష్టించిన వారిని వదిలేసి వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అరెస్ట్ చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా అరెస్టులు ఆపకపోతే జైల్‌భరో కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన విద్యార్థి, యువజనులు తమ సమస్యల పరిష్కారం కోసం సామాజిక మాధ్యమాలను బలంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. అయితే భాష విషయంలో ఎక్కడా అదుపు తప్పవద్దని, అభ్యంతరకర పదాలను ఉపయోగించవద్దని సూచించారు.

కక్ష సాధింపులతో కాలయాపన : దద్దాల

అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల మీద అక్రమంగా కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలతో కాలయాపన చేస్తోందని కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ విమర్శించారు. నెలకొక అంశాన్ని తీసుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు.

హామీలు నెరవేర్చండి : శ్రీకాంత్‌రెడ్డి

గత ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రాష్ట్రంలోని యువతకు ఎన్నో హామీలు ఇచ్చారని ప్రతి ఒక్కరికీ ఉద్యోగం ఇస్తామని, ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రచారం చేశారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది అయినా కనీసం ఒక్కరికి కూడా ఉద్యోగం ఇచ్చిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరుద్యోగులను తొలగించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి పాలకులు యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

నిరుద్యోగులకు మోసం: పల్నాటి

ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయకుండా నిరుద్యోగులను, అన్నీ వర్గాల ప్రజలను నిట్టనిలువునా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పల్నాటి రవీంద్రారెడ్డి విమర్శించారు. ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్‌క్యాలెండర్ ఇస్తామని చెప్పారని, నాలుగు లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇంతవరకు వాటిని అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం పాలన సంవత్సరం దాటినా ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా నిట్టనిలువునా మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల యూత్ రీజినల్ ఇన్‌చార్జ్ వెంకటాద్రి, ప్రకాశం, నెల్లూరు రీజినల్ ఇన్‌చార్జ్ దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, పార్టీ జాయింట్ సెక్రటరీ పాలడుగు రాజీవ్, ఒంగోలు, సంతనూతలపాడు, కనిగిరి, కొండపి, యర్రగొండపాలెం, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల యువజన విభాగం అధ్యక్షులు మల్లిశెట్టి దేవ, అన్వేర్, రాజశేఖరరెడ్డి, గంగాధరరెడ్డి, ఆళ్ల క్రిష్టారెడ్డి, జంకె క్రిష్టారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు వేముల శ్రీకాంత్, ఒంగోలు టౌన్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఖాదర్, దర్శి, కనిగిరి, కొండపి విద్యార్థి విభాగాల అధ్యక్షులు మహేంద్రరెడ్డి, మహేంద్ర రెడ్డి, సునీల్, యువజన విభాగం జనరల్ సెక్రటరీ ముల్లంగి రవీంద్రారెడ్డి, రాష్ట్ర స్టూడెంట్ సెక్రటరీ రవీంద్ర, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గాలిమోటు దేవప్రసాద్, దర్శి ఎస్సీ విభాగం అధ్యక్షుడు జి.ఏసుదాసు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వో ఓబులేసుకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యువతకు వెన్నుపోటు: ఎమ్మెల్యే తాటిపర్తి

అబద్ధాలు, అసత్యాలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఏడాది పాలనలో ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా విద్యార్థులు, యువకులకు వెన్నుపోటు పొడిచారని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. పక్క రాష్ట్రాల్లోని సైబరాబాద్, సైబర్‌సిటీలను రంగుల్లో చూపించి ఓట్లు కొల్లగొట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ భృతి ఇవ్వకుండా ఎగనామం పెట్టారని ధ్వజమెత్తారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ యువకులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన 'యువత పోరు' కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రసంగించారు. రాష్ట్రంలోని యువకులకు ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు ఇస్తానని, లేకపోతే ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని గత ఎన్నికల సమయంలో చేసిన ప్రచారాన్ని గుర్తు చేశారు. ఏడాది పాలన పూర్తయినా నిరుద్యోగ భృతి మాత్రం ఇవ్వలేదని, ఏడాదికిగాను రూ.36 వేలు బకాయిలు చెల్లించకుండా మోసం చేసిన చంద్రబాబును నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మెప్పు పొందటం కోసం ఒక్కరోజులో రూ.350 కోట్లు ఖర్చు పెట్టి యోగాంధ్ర నిర్వహించారని, దీనికి డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయో చెప్పాలని నిలదీశారు. గిన్నిస్‌బుక్‌లో ఎక్కాలని కోట్లు ఖర్చు చేస్తే జనాలు మ్యాట్ల కోసం కొట్టుకోవడమే సరిపోయిందని ఎద్దేవా చేశారు. రూ.4200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.2200 కోట్ల వసతి దీవెన, మొత్తం కలిపి రూ.6,400 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.750 కోట్లు మాత్రమే విడుదల చేశారని విమర్శించారు. అమ్మ ఒడి పథకానికి తల్లికి వందనం అని పేరు మార్చారని, రాష్ట్రంలో 84 లక్షల మంది తల్లులు ఉంటే 50 లక్షల మందికి మాత్రమే తల్లికి వందనం ఇచ్చాడని ధ్వజమెత్తారు. ఎక్కడో ఒక చోట ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురికి తల్లికి వందనం ఇచ్చి పచ్చమీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. పొగాకు రైతులను పరామర్శించడానికి వస్తే మహిళలతో నిరసనలు చేయించి గొడవలు సృష్టించారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మీదనే కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు.



అంబేడ్కర్ విగ్రహం సమీపంలో బారికేడ్లను అడ్డు పెట్టి రాకపోకలు అడ్డుకుంటున్న పోలీసులు



కలెక్టరేట్‌లోకి ఎవరినీ వెళ్లనీయకుండా ప్రధానద్వారం వద్ద మోహరించిన పోలీసులు

జగన్‌పై ప్రభుత్వం కుట్రలు

- ఫేక్ వీడియోతో అసత్య ప్రచారం
- 20 సెకన్ల వీడియో ఎక్కడ నుంచి వచ్చిందో బయటపెట్టాలి
- అబద్ధాలు చెప్పుకుంటూ మీరు పర్యటించినప్పుడు మా ప్రభుత్వం అడ్డుకోలేదు కదా..
- జడ్‌ప్లస్ కేటగిరీ ఉన్న జగన్‌కు సరైన భద్రత కల్పించడంలేదు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి ధ్వజం

ఒంగోలు సిటీ: పల్నాడుకు వెళుతున్న జగన్ కారుకింద పడి సింగయ్య చనిపోయారంటూ అబద్ధపు ప్రచారాన్ని సృష్టించారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. ఒంగోలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒక కల్పితమైన చిన్న వీడియోను ప్రచారంలోకి తీసుకొచ్చారన్నారు. ఆ వీడియోను గమనిస్తే వాహనం కిందపడిన వ్యక్తి గురించి ఆ వాహనం వెళ్లిన తర్వాత తెలిసే అవకాశం ఉండదా అని ఆయన ప్రశ్నించారు. ఒక్కసారి ఆలోచించండి టైర్ దగ్గర మాత్రమే సింగయ్య ఉన్నట్టు చూపిస్తున్నారన్నారు. మీ దగ్గర ఉన్న పూర్తి వీడియో విడుదల చేయొచ్చుగా అని నిలదీశారు. వేలాదిగా తరలి వచ్చిన జనం నుంచి టైర్ కింద ఆ వ్యక్తినే ఎలా తీయగలిగారని, కేవలం 20 సెకన్ల వీడియో ఎలా వచ్చిందని, ఆ సమయంలో ఉన్న మీ సెక్యూరిటీ సిబ్బంది ఏమయ్యారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పాటు కాన్వాయ్ ముందు ఉంటుందని, అది దాటుకుని సింగయ్య ఎలా వచ్చి పడ్డారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఇన్ని రోజుల తర్వాత ఆ వీడియోను విడుదల చేయాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. మీ ప్రభుత్వంలో పనిచేస్తున్న ఎస్పీనే అన్ని రకాలుగా విచారణ జరిపి ప్రమాదం జరిగింది జగన్ కాన్వాయ్‌లోని కారు కాదని చెప్పారన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆయన మీద ఎలాంటి ఒత్తిళ్లు తీసుకొచ్చి మాట మార్పించారని ధ్వజమెత్తారు. జెడ్‌ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న వ్యక్తికి బుల్లెట్ ప్రూఫ్ ఉన్న కారును నడిపేందుకు ప్రభుత్వ డ్రైవర్ ఉంటారన్న విషయాన్ని మర్చిపోయారా అని నిలదీశారు. వీటన్నింటినీ నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మంచి వాహనాన్ని ఇవ్వకపోతే ప్రభుత్వ అనుమతితో సొంత వాహనాన్ని కొనుగోలు చేసిన విషయం నిజం కాదా అన్నారు. ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి వెళుతుంటే రోప్ పార్టీ ఉండాలి కదా అని ప్రశ్నించారు. పొదిలి, పల్నాడులకు జగన్ వెళ్లినపుడు జడ్ ప్లస్ కేటగిరీ ఉన్న వ్యక్తికి సరైన భద్రత కల్పించలేదని ఆరోపించారు. సెక్యూరిటీ ఇవ్వలేమని స్పష్టం చేయండని నిలదీశారు. ఒక ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తికి కనీస భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇది దుర్మార్గపు చర్య అని అన్నారు. మేము ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఇలాంటి ఆంక్షలు పెట్టామా? రాష్ట్రమంతా అబద్ధాలు చెప్పుకుంటూ తిరిగినా మేము ఆపామా అని అన్నారు. యువగళం పేరుతో ఎర్రబుక్ పట్టుకుని లోకేష్ తిరిగినా ఆపామా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు మీరు, మీ కుమారుడు, పవన్ కళ్యాణ్ ముగ్గురూ కలసి స్వేచ్ఛగా తిరిగారు కదా? మీకు ఉన్న స్వేచ్ఛ మాకు లేదా అని ప్రశ్నించారు. సింగయ్య మా పార్టీకి చెందిన వ్యక్తి.. ఆయన చనిపోవడం విచారకరం, ఆయన కుటుంబానికి మా పార్టీ అండగా నిలిచిందన్నారు. కందుకూరులో మీ ప్రచారయావకు ఎనిమిది మంది చనిపోతే ఏం ఆదుకున్నారని, మీరు అధికారంలోకి వచ్చాక ఆ కుటుంబాల్లో ఎవరికైనా ఉద్యోగాలు ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. గుంటూరులో చీరలు పంచుతూ ఆరుగురిని పొట్టన పెట్టుకున్నారే వారికి ఏం న్యాయం చేశారని, గోదావరి పుష్కరాల్లో చనిపోయిన కుటుంబాలను, వైకుంఠ ఏకాదశి నాడు తిరుమలలో చనిపోయిన వారి ఆదుకున్నారా అని నిలదీశారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలు కావా అని తాటిపర్తి ప్రశ్నించారు. నిరంకుశ పరిపాలనకు స్వస్తి పలికి ప్రజలకు మేలు చేయాలన్నారు.



ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలివ్వండి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఒంగోలు టౌన్: అరకొర జీతాలతో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కరించాలని కోరుతూ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు కేవీ సుబ్బమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీలు ప్రభుత్వ ఉద్యోగులు అన్న పదాన్ని తొలగించాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెరిగిన కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. సుదీర్ఘ కాలంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్న అంగన్‌వాడీల పోరాటాలకు సీఐటీయూ అండగా నిలబడుతుందని తెలిపారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీల పిల్లలకు తల్లికి వందనం వర్తించేలా ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ గౌరవాధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ గతంలో 42 రోజుల పాటు సమ్మె చేసినప్పుడు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని కూటమి పాలకులు నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం వినతి పత్రం తీసుకునేందుకు ఐసీడీఎస్ పీడీ తిరస్కరించారు. దాంతో డీఆర్‌ఓ చిన ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సుజాత, తిరుపతమ్మ, ఎల్లమ్మ, సీఐటీయూ ఉపాధ్యక్షుడు బంకా సుబ్బారావు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకుడు చిరంజీవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

● ఏఎస్పీ (అడ్మిన్) నాగేశ్వరరావు

ఒంగోలు టౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీస్‌శాఖ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి 83 మంది వచ్చి ఫిర్యాదులు అందజేశారు. ఫిర్యాదుదారులతో మాట్లాడిన నాగేశ్వరరావు.. చట్టప్రకారం విచారణ జరిపి సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయా సమస్యలపై సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ఎక్కువగా భూ వివాదాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామనే మోసాలు, కుటుంబ సమస్యలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, ఎస్సీ ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్ద న్‌రావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 22 మందికి జరిమానా

ఒంగోలు టౌన్: విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా సోమవారం ఒంగోలు నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేసి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 22 మందిని పట్టుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి 10 వేల రూపాయల చొప్పున కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, అతివేగంగా వాహనాలు నడపరాదని కోరారు.

రాష్ట్రంలో దుర్మార్గపు పాలన

● ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు
● ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు జగన్ పర్యటనల్లో ప్రజా స్పందనే నిదర్శనం
● స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారు
● ఫేక్ వీడియోతో జగన్‌పై అసత్య ప్రచారం
● ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఎమ్మెల్యే తాటిపర్తి ధ్వజం

ఒంగోలు సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వికృత రాజకీయం, విషపూరిత ప్రచారం చేస్తోందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. ఒంగోలు నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోయిందని, దానిని నిలదీస్తున్న వారి గొంతులు నొక్కేస్తోందని విమర్శించారు. జిల్లాలోని పొదిలి, పల్నాడులో జరిగిన ఘటనలు, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అక్రమ అరెస్టులే అందుకు నిదర్శనమని అన్నారు. వీటిని అందరూ ఖండించాలన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా యువతకు అన్యాయం చేయడం అలవాటని మండిపడ్డారు. ఆనాడు నిరుద్యోగ భృతి ఇస్తామని కొందరికే ఇచ్చి మంగళం పలికేశారన్నారు. మళ్లీ అధికారంలోకి రావడానికి జాబ్ క్యాలెండర్, ఉద్యోగం వచ్చే వరకూ రూ.3 వేల నిరుద్యోగ భృతి, ఏటా ఐదు లక్షల ఉద్యోగాలు, ఐదేళ్లు 25 లక్షల మందికి ఉద్యోగాల హామీలు గుప్పించారన్నారు. బీసీలకు పది వేల కోట్ల ప్రత్యేక నిధి, ఐదు వేల కోట్ల ఆదరణ, ఆరోగ్యశ్రీపై ఎన్నో హామీలిచ్చి మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల్లో కూటమి పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే రూ.81 వేల కోట్లు అవసరం అవుతాయన్నారు. ఏడాది కాలంలో ఈ ప్రభుత్వం వెచ్చించింది మాత్రం 10 శాతం కూడా లేదని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ ఇచ్చేశామని, వీటికి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే నాలుక మందం అని చంద్రబాబు అనడం సరికాదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాలన్నింటినీ ఎగ్గొట్టారని ఆరోపించారు. ఏడాది పూర్తయిన తర్వాత తొలి అడుగు అంటూ ఉత్సవాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పొదిలి జగన్ పర్యటనకు పెద్ద ఎత్తున తరలివచ్చిన జనమే ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడకు వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారంటే.. అది ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత నుంచే వస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఇప్పటి వరకూ ప్రవేశపెట్టిన బడ్జెట్లలో ఆ స్థాయిలో నిధులు కేటాయించకపోవడం చూస్తుంటే.. ఆయనకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని దుయ్యబట్టారు. పశ్చిమ ప్రకాశానికి సంజీవనిగా ఉన్న ఈ ప్రాజెక్టును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మార్కాపురాన్ని జిల్లా చేస్తామని ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారన్నారు.

రైతుల పరిస్థితి దారుణం...

కూటమి ఏడాది పాలనలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని ఎమ్మెల్యే తాటిపర్తి మండిపడ్డారు. గతంలో రూ.24 వేలు అమ్మిన తేజ రకం మిర్చి నేడు రూ.పది వేలకు కూడా అమ్ముడుపోవడం లేదన్నారు. పత్తి రైతు పరిస్థితి కూడా అంతేనన్నారు. ఇక, పొగాకు రైతు పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. నాణ్యమైన పొగాకును సైతం కొనే వారు కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్వా రైతులు సాగు విరామాన్ని ప్రకటించారన్నారు. ఇవన్నీ చూస్తే పెద్ద మొత్తంలో ప్రజా వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. కచ్చితంగా ప్రజలు తిరగబడతారన్నారు. కూటమి పార్టీల నాయకులను ప్రజలు ద్వేషిస్తున్నారని, ఏడాది కాలంలో ఇంత వ్యతిరేకత రావడం దేశంలోని ఏ రాష్ట్రంలో లేదని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టి జైలుపాలు చేస్తున్నారని విమర్శించారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డికి లిక్కర్‌తో సంబంధాలుంటే ముందే ఎఫ్‌ఐఆర్‌లో ఎందుకు ఆయన పేరు లేదని తాటిపర్తి ప్రశ్నించారు. చెవిరెడ్డి గన్‌మెన్‌లలో మీకు అనుకూలంగా చెప్పిన వారికి ప్రమోషన్లు ఇచ్చి ఆక్టోపస్‌లో చేరారని, మీకు సహకరించని వారు ఆస్పత్రి పాలయ్యారని ధ్వజమెత్తారు. ఇందంతా పరిశీలిస్తే ప్రభుత్వ కుట్రకోణం అర్థమవుతోందన్నారు. దీనిని వైఎస్సార్ సీపీ ఖండిస్తోందన్నారు. చెవిరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

రెడ్ బుక్ పాలన కొనసాగితే మరింత వ్యతిరేకత...

రాష్ట్రంలో ఇదేవిధంగా రెడ్ బుక్ పాలన కొనసాగితే ప్రజల నుంచి మరింత వ్యతిరేకత చవిచూడాల్సి వస్తుందని ఎమ్మెల్యే తాటిపర్తి హెచ్చరించారు. యువతకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని, మొదటి సంతకం పెట్టిన డీఎస్సీకి అతీగతీలేదని విమర్శించారు. ఏడాదికి ఐదు లక్షల మందికి ఉద్యోగాల మాట దేవుడెరుగు, అధికారంలోకి వచ్చాక సుమారు నాలుగు లక్షల మంది ఉద్యోగాలు పీకేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా సువర్ణ పరిపాలన అని ఆయన ప్రశ్నించారు. దీనిని ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారన్నారు. స్వర్ణాంధ్ర చేస్తున్నామని చెబుతూ వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ వారిని ఖైదీలుగా మారుస్తున్నారన్నారు. ఏడాది కాలంలో ఒక్క కంపెనీ రాలేదని, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, ఒక పెట్టుబడి లేదని ధ్వజమెత్తారు. ఆరోగ్యశ్రీని తొలగించి రాష్ట్రాన్ని రోగాంధ్రగా మార్చేస్తున్నారని, ఆరోగ్యశ్రీ లేక రోగాలతో అల్లాడుతున్న ప్రజల్ని పట్టించుకునే వారే కరువయ్యారని అన్నారు. బీసీలకు మైనింగ్‌లో 20 శాతం రాయితీ ఇస్తామన్నారని, జిల్లాలో ఒక్క బీసీకైనా మైన్ ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. మత్స్యకారులు, అర్చకులు, నాయీ బ్రాహ్మణులందర్నీ మోసం చేశారన్నారు. ఇచ్చిన హామీలను 95 శాతం అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని గుర్తుచేశారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కూటమిని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించాలి

● ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ తమీమ్ అన్సారియా


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా చూడాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఒంగోలులోని కలెక్టరేట్‌లో మీ కోసం సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలపై అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు ఉండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్దిత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్, జాన్సన్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల కోసం స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహించాలి...

జిల్లాలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించాలని జిల్లా డెమోక్రటిక్ జర్నలిస్టు ఫోరం నాయకులు కలెక్టర్‌కు విన్నవించారు. బి.శ్రీనివాసరావు, ఎన్.రవికుమార్, తదితరులు గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌ను కలిసి జిల్లాలో మహిళా ఉద్యోగులపై జరిగిన శారీరక, మానసిక వేధింపుల వివరాలను అర్జీ రూపంలో తెలియజేశారు. మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై రోజురోజుకు వేధింపులు అధికమవుతున్నాయని వివరించారు. ఒక మహిళా ఉద్యోగి విషయంలో చాలా దారుణంగా సహచర పురుష ఉద్యోగులు వేధించి కేసులు నమోదైనా నేటికీ ఎలాంటి చర్యలు లేకపోగా ఇంకా ఆ ఉద్యోగినిని బాధపెడుతూనే ఉన్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో 20 వేల మందికిపైగా ఉన్న మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్ల గురించి వివరించిన అధికారులు...

జిల్లాలో నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లు పెరుగుతున్నాయని కలెక్టర్‌కు మార్క్‌ఫెడ్, జిల్లా వ్యవసాయ అధికారులు వివరించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌సెల్‌లో మార్క్‌ఫెడ్ డీఎం మురళీకృష్ణ, జేడీఏ ఎస్.శ్రీనివాసరావు కలెక్టర్‌ను కలిసి మద్దిపాడు మండలం గార్లపాడులో నల్ల బర్లీ పొగాకు అమ్మకాల్లో పురోగతిని వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రిజెక్టు చేసే బేళ్ల శాతం పూర్తిగా తగ్గిపోవాలని ఆదేశించారు. నల్ల బర్లీ పొగాకు రైతులను ఆదుకోవటమే లక్ష్యంగా ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జిల్లా మొత్తంమ్మీద 10 మండలాల్లో నల్ల బర్లీ పొగాకు పండించారని, పూర్తిగా కొనుగోలు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు.

మాజీ ఎంపీపీ 'పోశం'పై అక్రమ కేసు!

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకుల బరితెగింపు రోజురోజుకూ పెచ్చుమీరుతోంది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, తాళ్లూరు మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డిపై తాళ్లూరు పోలీస్ స్టేషన్లో అక్రమ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. తాళ్లూరు రెవెన్యూ పరిధిలో మధుసూదన్ రెడ్డికి చెందిన పొలంలోకి స్థానిక టీడీపీ నేతలు అక్రమంగా ప్రవేశించి, ఖాళీ చేయాలంటూ దౌర్జన్యానికి దిగారు. తన పూర్వీకుల ద్వారా సంక్రమించిన భూమిని వదిలేయాలని చెప్పేందుకు మీరెవరంటూ టీడీపీ నాయకులను నిలదీయడంతో మాటామాటా పెరిగింది. భూమికి సంబంధించిన పత్రాలను టీడీపీ నాయకులకు చూపినప్పటికీ.. పొలంలో అడుగుపెడితే అంతుచూస్తామని బెదిరించి వెళ్లారు. టీడీపీ నాయకుల దౌర్జన్యంపై తాళ్లూరు పోలీస్ స్టేషన్లో ఈనెల 11న 'పోశం' ఫిర్యాదు చేశారు. కేసు ఎందుకు నమోదు చేయడం లేదని ఎస్సైని ప్రశ్నించగా టీడీపీ నాయకులను పిలిపించి, వారితో తప్పుడు ఫిర్యాదు చేయించి తనపై అక్రమ కేసు నమోదు చేశారని 'పోశం' వివరించారు. తప్పుడు కేసులకు బెదిరేది లేదని, ఈ విషయమై న్యాయస్థానంలో పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

సాధువు వేషంలో వచ్చిన దొంగ అరెస్ట్

● నాలుగు సవర్ల బంగారు గొలుసు స్వాధీనం
● నిందితుడు శ్రీకాకుళం వాసిగా గుర్తింపు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి: సాధువు వేషంలో వచ్చి మహిళపై దాడి చేసి బంగారు గొలుసుతో పరారైన దొంగను చీమకుర్తి పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో మీడియా ముందు నిందితుడిని హాజరుపరిచారు. సీఐ ఎం.సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం పట్టణానికి చెందిన 36 సంవత్సరాల వయసు గల పెదడ శివను ఒంగోలు–చీరాల రహదారిలోని త్రోవగుంట క్రాస్‌రోడ్డులో పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతను సాధువు వేషంలో ఈ నెల 15వ తేదీ చీమకుర్తిలోని ప్రభుత్వాస్పత్రి పక్కనే నివాసం ఉంటున్న లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గోలి పద్మజ ఇంట్లోకి వెళ్లి కత్తితో ఆమె మెడపై దాడి చేసి గాయపరిచాడు. ఆపై రుబ్బురోలు పత్రంతో ఆమె మొహంపై దాడి చేసి మెడలో ఉన్న దాదాపు 4 సవర్ల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. తొలుత సాధువు వేషంలో ఆమె ఇంటి ముందుకు వెళ్లి ఏదైనా సహాయం చేయాలంటూ పద్మజను అడిగాడు. బయటకు వచ్చిన పద్మజ ఏమీ లేవని చెప్పి ఇంట్లోకి వెళ్లింది. నిందితుడు కూడా ఆమెను అనుసరించి కత్తితో, రుబ్బురోలు పత్రంతో దాడి చేశాడు. సాధువు వేషంలో వచ్చిన దుస్తులను అక్కడే వదిలేసి పద్మజ కుమారుడు దుస్తులు ధరించి పరారయ్యాడు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించిన పోలీసులు.. బాధితురాలి బంధువు ఎస్.శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ ఆదేశాలతో నాలుగు టీమ్‌లుగా ఏర్పడి నిందితుడు పెదడ శివను అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వివరించారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల అడ్డగింత


హైవేపై కంప వేసి పనులను అడ్డుకున్న రైతులు

సీఎస్‌పురం(పామూరు): 'గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూములు కావాలని అడిగితే ఇచ్చాం. ఏళ్లు గడుస్తున్నా పరిహారం ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారు. తీసుకున్న భూములకు తగిన పరిహారం ఇచ్చాకే పనులు చేసుకోండి' అంటూ రైతులు నిరసనకు దిగారు. మండల కేంద్రమైన సీఎస్‌పురం వద్ద నిర్మాణంలో ఉన్న బెంగళూరు–కడప–విజయవాడ(బీకేవీ) గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనుల ను సోమవారం సీఎస్‌పురం, డీటీపల్లి, ముళ్లపాడు గ్రామాలకు చెందిన రైతులు అడ్డుకున్నారు. నిర్మాణంలో ఉన్న రోడ్డుపై కంపవేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు లు మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణం వల్ల తాము కోల్పోతున్న పొలానికి సంబంధించి పరిహారం నేటికీ మంజూరు కాలేదన్నారు. ఈ విషయమై ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని వాపోయారు. తమకు పరిహారం ఇచ్చాకే రోడ్డు నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించాలని రైతులు తేల్చిచెప్పారు.

తొలిరోజే తుస్సు..!

● జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లలో మహిళా సర్పంచ్‌లకు శిక్షణ ప్రారంభం
● పదవీ కాలం ముగియనున్న సమయంలో శిక్షణ తరగతులు ఎందుకో?
● కూటమి ప్రభుత్వ తీరుపై మహిళా సర్పంచ్‌ల ఆగ్రహం
● ప్రజాప్రతినిధులకు రవాణా ఖర్చులు కూడా ఇవ్వని వైనం
● ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 567 మంది మహిళా సర్పంచ్‌లు
● కనిగిరిలో 64 మందికిగాను వచ్చింది ఆరుగురే..
● మార్కాపురంలో 61 మందికిగాను పది మంది హాజరు


కనిగిరి ఎంపీడీఓ కార్యాలయంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

కనిగిరి రూరల్/మార్కాపురం:

మహిళా ప్రజాప్రతినిధుల్లో మార్పు తీసుకొచ్చేందుకు.. స్థానిక పాలనలో మహిళా ప్రజాప్రతినిధుల పాత్ర పెంచేందుకు, నాయకత్వ లక్షణాలు, విజ్ఞానం, నైపుణ్యం, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు తొలి రోజే తుస్సుమన్నాయి. మరో కొద్ది నెలల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనున్న తరుణంలో ప్రభుత్వం చేపట్టిన మూడు రోజుల శిక్షణపై మహిళా సర్పంచ్‌లు తీవ్ర నిరాసక్తి చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని మార్కాపురం, కనిగిరి, ఒంగోలు, చీరాల, కందుకూరు ఎంపీడీఓ కార్యాలయాల్లో ఈనెల 23 నుంచి జూలై 2వ వారం వరకు ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజుల చొప్పున మహిళా సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. సోమవారం కనిగిరి, మార్కాపురంలో డివిజన్ స్థాయి శిక్షణ తరగతులు తూతూమంత్రంగా సాగాయి.

శిక్షణ శిబిరాలు వెలవెల

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల్లో 542 మంది మహిళా సర్పంచ్‌లు ఉన్నట్లు నివేదికలున్నాయి. తొలిరోజు కనిగిరి మండల పరిషత్ కార్యాలయంలో కేకేమిట్ల, సీఎస్‌పురం, దొనకొండ, దర్శి మండలాల సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. దీనికి 64 మంది మహిళా సర్పంచ్‌లు హాజరు కావాల్సి ఉండగా.. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు పట్టుమని 10 మంది కూడా కనిపించలేదు. శిక్షణ తరగతులను ఎంపీపీ డి.ప్రకాశం, ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ, పొన్నలూరు ఎంపీడీఓ సుజాత, ఆర్‌పీలు అశోక్, నాగేమల్లేశ్వరరావు ప్రారంభించారు. ఆరుగురే హాజరుకాగా.. ఖాళీ కుర్చీలతో శిక్షణ కార్యక్రమాన్ని మమగా ముగించారు.

● మార్కాపురం ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమం తొలిరోజే వెలవెలబోయింది. గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు, కంభం, బేస్తవారపేట, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, మార్కాపురం నియోజకవర్గంలోని తర్లుపాడు మండలాలకు చెందిన సర్పంచ్‌లు 61 మంది శిక్షణకు హాజరుకావాల్సి ఉండగా 10 మంది కూడా హాజరు కాలేదు. శిక్షణ ఇచ్చేందుకు నలుగురు రిసోర్సు పర్సన్లను నియమించిన ప్రభుత్వం.. సర్పంచ్‌లను మాత్రం సమావేశానికి రప్పించడంలో విఫలమైంది.

మహిళా సర్పంచ్‌ల నిరసన

ప్రభుత్వం లక్ష్యం, ఉద్దేశాలు ఏవైనప్పటికీ కనీస సౌకర్యాలు, వసతులు కల్పించకుండా 40 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో శిక్షణా తరగతులు నిర్వహించడంపై మహిళా సర్పంచ్‌లు మండిపడుతున్నారు. కనిగిరిలో తొలిరోజు నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరుకావాలంటే దొనకొండ మండల సర్పంచ్‌లు 40 కి.మీ, కొనకనమిట్ల, దర్శి, సీఎస్‌పుం మండలాల సర్పంచ్‌లు 32 నుంచి 35 కి.మీల దూరం ప్రయాణించాల్సి ఉంది. మార్కాపురంలో శిక్షణకు గిద్దలూరు, రాచర్ల, బేస్తవారిపేట, కొమరోలు మండలాల సర్పంచ్‌లు 40 కి.మీ నుంచి 60 కి.మీ మేర ప్రయాణించాల్సి ఉంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తుండటంతో తిరిగి ఇళ్లకు చేరుకోవడం కష్టమనే భావనతో మహిళా ప్రజా ప్రతినిధులు శిక్షణకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో సర్పంచ్‌లకు ఎక్కడా ప్రాధాన్యత ఇవ్వకుండా అధికార పార్టీ నేతలకే పెత్తనమిచ్చారు. అధికారులు సైతం అందుకు సహకరించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం దక్కని పరిస్థితుల్లో ఉత్తుత్తి శిక్షణలు తమకు అవసరమా అంటూ మహిళా సర్పంచ్‌లు పెదవి విరుస్తున్నారు.

కనిగిరిలో శిక్షణకు మహిళా సర్పంచ్‌లు హాజరుకాకపోవడంపై ఎంపీడీఓ ప్రభాకర్ శర్మను వివరణ కోరగా.. 'తొలిరోజు కావడంతో పూర్తిగా హాజరు కాలేదు. శిక్షణకు వచ్చిన వారికి సిట్టింగ్ చార్జీ కింద ప్రభుత్వం రూ.100 చెల్లించే అవకాశం ఉంది. రవాణ చార్జీలు ఎంత అనేదానిపై ఇంకా పూర్తి క్లారిటీ ఇవ్వలేదు. శిక్షణకు అందరు మహిళా ప్రజాప్రతినిధులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నాం' అని చెప్పారు.


మార్కాపురంలో సర్పంచ్‌ల శిక్షణ పరిస్థితి ఇదీ..

పొగాకు రైతు నిలువు దోపిడీ

● వేలంలో 20 శాతం బేళ్లకే గరిష్ట ధర
● మిగిలిన 80 శాతం బేళ్లకు కనిష్టమే..
● రోజు రోజుకూ దిగజారుతున్న లో గ్రేడ్ పొగాకు ధర
● వ్యాపారుల సిండికేట్‌తో రైతులకు తీరని నష్టం

కొండపి/టంగుటూరు: వేలం కేంద్రాల్లో రైతులను వ్యాపారులు నిలువునా దోచేస్తున్నారు. ఈ ఏడాది పెరిగిన పొగాకు ఖర్చులకు, వేలంలో వస్తున్న ధరలకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. వేలం అధికారులు సైతం వ్యాపారులకు మద్దతుగా ఉండటంతో రోజు రోజుకు ధరలు దిగజారుతున్నాయి. ఓ వైపు దిగజారుతున్న ధరలు, మరో వైపు నిత్యం వందల సంఖ్యలో తిరస్కరణకు గురవుతున్న బేళ్లతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలంలో గరిష్టంగా రూ.280 ధర ఇస్తున్నారు. కానీ వ్యాపారులు సిండికేట్‌గా మారి కేవలం 20 శాతం బేళ్లను మాత్రమే ఈ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన బేళ్లను కనిష్ట ధరకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోపక్క లో గ్రేడ్ పొగాకు ధరలు రోజు రోజుకూ దిగజారుతున్నాయి. వేలం ప్రారంభంలో రూ.240 పలికిన లో గ్రేడ్ పొగాకు ప్రస్తుతం రూ.165కు పడిపోయింది. రానున్న రోజుల్లో లో గ్రేడ్‌పొగాకు ధర మరింత పడిపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వందల బేళ్ల తిరస్కరణ

వేలం కేంద్రానికి సోమవారం క్లస్టర్ పరిధిలోని గోగినేనివారిపాలెం, అక్కచెరువుపాలెం, పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు 1024 బేళ్లను వేలానికి తీసుకురాగా 732 బేళ్లను కొనుగోలు చేసి 287 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.165 పలకగా సరాసరి రూ.248.23గా నమోదైంది. వేలంలో 24 కంపెనీలు పాల్గొన్నా..నాలుగైదు కంపెనీలు మాత్రమే ఎక్కువ శాతం పొగాకు కొనుగోలు చేశాయి. రైతులు తీసుకు వచ్చిన బేళ్లలో ఎక్కువ శాతం బేళ్లను రూ.165 నుంచి రూ.240 వరకు కొనుగోలు చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన వేలంలో కేవలం 160 బేళ్లకు మాత్రమే గరిష్ట ధర రూ.280 రాగా మిగిలిన బేళ్లకు కనిష్ట ధరలు వేశారని రైతులు వాపోయారు.


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

అదనపు భారం

రోజుకు వందకు పైగా బేళ్లను వ్యాపారులు తిరస్కరించడంతో మరొకసారి వేలానికి తీసుకురావడానికి ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. పొగాకు బోర్డు అధికారులు బయ్యర్లతో సంప్రదింపులు చేసి గిట్టుబాటు ధరకు పొగాకును కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అధికారులు మొక్కుబడిగా వేలం కేంద్రాలకు పరిశీలనకు వచ్చి వెళుతున్నారే తప్ప రైతుల గోడు ఆలకించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టంగుటూరు వేలం కేంద్రానికి 958 బేళ్లు రాగా 207 బేళ్లను తిరస్కరించి 751 కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180 పలికి సరాసరి రూ.239.34గా నమోదైంది.

రెండు గ్రానైట్ లారీలు సీజ్

మద్దిపాడు: తాళ్లూరు–వెల్లంపల్లి రహదారిలో అక్రమంగా గ్రానైట్ రాళ్లు తరలిస్తున్నట్లు రెండు లారీలను ఆదివారం రాత్రి మద్దిపాడు పోలీసులు సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్ శాఖ వారికి లారీలను అప్పగించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.